ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

రంగారెడ్డి, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యలు తెలుపడానికి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ నారాయణరెడ్డితో పాటు రెవెన్యూ అధికారి సంగీత దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టవద్దన్నారు. ప్రజావాణిలో వివిధ అంశాలపై 65 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అనంతరం జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి శాఖలవారీగా సమీక్షించారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఆయిల్‌పామ్ మొక్కల పెంపకానికి జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, ఉద్యానవన శాఖలు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు సబ్సిడీలు అందేలా కృషిచేస్తూ పెద్దఎత్తున ఆయిల్ పామ్ మొక్కలు పెంచేందుకు కృషిచేయాలని సూచించారు. జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ పనులను ముందుగా పరిష్కరించాలని, అంకితభావంతో పనిచేయాలని, కిందిస్థాయిలో శాఖ పనితీరును పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలు జారీచేసే పనులు పెండింగ్‌లో లేకుండా చూడాలని తెలిపారు. ఫైల్స్ పెండింగ్‌లో పెట్టకుండా నిబంధనల ప్రకారం పనులు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సోమవారం ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లిలోని భారత్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఆరోగ్య దినోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు, ఆర్డీవో అనంతరెడ్డి, ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వర్చువల్ పద్ధతిలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ను మంత్రులతో కలిసి సీఎం, డిప్యూటీ సీఎం ప్రారంభించగా, స్థానికంగా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేశారు.
– రంగారెడ్డి, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ)

బీఆర్ఎస్వీ నాయకుల అరెస్ట్

బీఆర్ఎస్వీ నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు

పూడూరు, డిసెంబర్ 2 : రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అన్ని విధాల విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి జంగయ్య పేర్కొన్నారు. సోమవారం పూడూరులోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థినుల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లారు. చన్గోముల్ పోలీసులు ఆయనను గురుకుల పాఠశాల విద్యార్థినులను కలువకుండా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయనతోపాటు పూడూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు రాంచంద్రయ్యను కూడా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల పాఠశాలల విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలేదని, సరైన మౌలిక వసతులు కల్పించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

చేవెళ్ల సీఐకి వినతిపత్రం అందజేస్తున్న కార్తీక్‌రెడ్డి, నాయకులు

బీజాపూర్ హైవే విస్తరణ పనులపై

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

- బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి
- చేవెళ్ల ఆర్డీవోకు వినతిపత్రం అందజేత

చేవెళ్లటౌన్, డిసెంబర్ 2 : బీజాపూర్ హైవే విస్తరణ పనులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి తెలిపారు. చేవెళ్ల బీజాపూర్ రహదారి రోడ్డు పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని కార్తీక్‌రెడ్డి, కృష్ణారెడ్డి షాబాద్ మండల మాజీ జడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు దేశమోళ్ల ఆంజనేయులు, చేవెళ్ల నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డితో కలిసి చేవెళ్ల ఆర్డీవో చంద్రకళకు వినతిపత్రం అందజేశారు. ఆదివారం చేవెళ్ల బీజాపూర్ రహదారి మీర్జాగూడ గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయినందుకు ప్రభుత్వంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని చేవెళ్ల పోలీస్‌స్టేషన్లో సీఐ శ్రీధర్ భూపాల్‌కు పిటిషన్ దాఖలు చేశారు.

ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాల విషయంలో రాజకీయాలకు, రాజకీయ లాభాలకు ముడిపెట్టొద్దని.. అప్పా నుంచి మన్నెగూడ వరకు నాలుగు లైన్ల రోడ్డు మంజూరై ఏడాదిన్నర పైనే అవుతున్నా రోడ్డు విస్తరణ పనులు ఇంకా మొదలుపెట్టకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి తన నియోజకవర్గానికి వెళ్లాల్సిన రోడ్డు కూడా ఇదేనని, సీఎం వెళ్లే రోడ్డు పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉన్నదో ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. అసలు ప్రభుత్వానికి ఈ రోడ్డు విస్తరణ పనులు చేపట్టడానికి చిత్తశుద్ధి అనేది ఉన్నదా అని ప్రశ్నించారు. రోడ్డు విస్తరణ పనులు మొదలుపెట్టాలని 6 నెలల నుంచి మొత్తుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సర్కారు వెంటనే స్పందించకపోతే చేవెళ్ల ప్రాంతాన్ని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నా బీజాపూర్ హైవే రోడ్డు ఊసే ఎత్తట్లేదని.. ఈ రోడ్డుపై ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని రోజులని గ్రీన్ ట్రిబ్యునల్ పేరు చెప్పి రోడ్డు పనులు చేయకుండా దాటవేస్తారని.. మీకు చేతనవు తదా లేదా లేదంటే మేమే పిటిషన్ దాఖలు చేసి ట్రిబ్యునల్‌లో కొట్లాడుతామని సర్కారును హెచ్చరించారు. రోడ్డు పనులను ప్రారంభించకపోతే పార్టీలకతీతంగా పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేస్తామని కార్తీక్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, నరహరిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు బ్యాగరి నర్సింహులు, తలారం నర్సింహులు, మాజీ డైరెక్టర్లు వెంకటేశ్, ఘనీ, మాజీ ఎంపీటీసీలు ఎల్లయ్య, సత్యనారాయణచారి, నాయకులు శేఖర్, మాధవగౌడ్, మాణిక్యారెడ్డి, మాధవరెడ్డి, మల్లేశ్, మహేందర్, రాజు, రాంప్రసాద్, విఘ్నేశ్‌గౌడ్ ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పలువురు మృతి

పూడూరు, డిసెంబర్ 2 : కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం అలూరు వద్ద జరిగి లారీ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోయారని బీఆర్ఎస్ పార్టీ పూడూరు మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలోనే హైదరాబాద్–బీజాపూర్ హైవే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని తెలిపారు. సీఎం సొంత జిల్లాకు వికారాబాద్ జిల్లా ప్రాంతం నుంచే ఈ హైవే రోడ్డు వెళ్తుందని.. తరచుగా ఆయన కూడా ఈ మార్గం గుండా ప్రయాణిస్తారని తెలిపారు. రోడ్డు వెడల్పు కాకపోవడంతో ప్రమాదాలకు గురై ఎన్నో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నిత్యం స్పీకర్ ప్రసాద్‌కుమార్, మూడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు హైదరాబాద్ నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారన్నారు. కాని ఈ రోడ్డు మార్గంలో జరుగుతున్న ప్రమాదాలను వారు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి అభివృద్ధి పేరిట రైతుల భూములను లాక్కోవడాన్ని పక్కన పెట్టి ఈ రోడ్డు నిర్మాణంపై దృష్టి పెట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని ఆయన కోరారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు వెంటనే ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేశారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- అధికారులతో వివిధ అంశాలపై సమీక్షా సమావేశం

వికారాబాద్, డిసెంబర్ 2 : ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆసరా పింఛన్, భూ సమస్యలపై(128) ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ అధికారులతో వివిధ అంశాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అమలుజేస్తున్న ప్రాధాన్య పథకాలకు జిల్లా అధికారులు ప్రాధాన్యత క్రమంలో ఎప్పటికప్పుడు లక్ష్యాలను పూర్తిచేసేందుకు కృషి చేయాలన్నారు. పర్మిషన్ తీసుకోకుండా గురుకుల స్కూల్స్, కాలేజీల్లో ఎవ్వరిని కూడా అనుమతించరాదని సూచించారు. డేటా ఎంట్రీని వేగవంతం చేయాలని, మధ్యాహ్న భోజనానికి సంబంధించి అంగన్‌వాడీలు, పాఠశాలలు, రెసిడెన్సీలు, సంక్షేమ వసతి గృహాల్లో ఎలాంటి చిన్న లోపం లేకుండా చూసుకోవాలన్నారు. సీఎం కప్ క్రీడలను డిసెంబర్ 7 నుంచి 21 వరకు నిర్వహించనున్నందున ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. డిసెంబర్ 7 నుంచి 8 వరకు గ్రామపంచాయతీ స్థాయిలో, 10 నుంచి 12 వరకు మండల స్థాయిలో, 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలో క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలాలకు చెందిన ప్రత్యేక అధికారులు మండల స్థాయిలో జరిగే అన్ని అంశాలపై దృష్టి సారించి ప్రత్యేక చొరవ చూపించాలన్నారు. ముఖ్యంగా సంబంధిత శాఖల అధికారులు కిందిస్థాయి సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఎక్కడ సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు, లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, ఆర్డీవో వాసుచంద్ర పాల్గొన్నారు.

అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

విద్యార్థులకు సకాలంలో స్కాలర్‌షిప్ అందించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్సీ విద్యార్థులకు అందించే పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌పై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల అధికారులతో కలిసి జిల్లాలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునే క్రమంలో వస్తున్న సమస్యలను అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి సర్టిఫికెట్‌లో ఉన్న వివరాలు ఆధార్ కార్డులో ఉండేలా తప్పులను సరిచేసుకునేందుకు వీలుగా ఆధార్ కిట్లను సమకూర్చుకోవాలన్నారు. విద్యార్థుల గ్యాప్ సర్టిఫికెట్ నిమిత్తం కళాశాల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలు డీఎస్సీడీవోకు విద్యార్థుల జాబితాలను సమర్పించాలని తెలిపారు. నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా ఇ–పాస్ పోర్టల్ స్కాలర్‌షిప్ నిమిత్తం రిజిస్టర్ చేసుకున్నట్లయితే స్కాలర్‌షిప్ త్వరలో మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి మల్లేశం, డీటీడీవో కమలాకర్‌రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్‌నాయక్, సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపాలన – ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సోమవారం వికారాబాద్ జిల్లా అనంతగిరి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆరోగ్య ఉత్సవాల కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఎంహెచ్‌వో వెంకటరమణ, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. – వికారాబాద్, నవంబర్ 2

నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విచారణ జరుపుతున్న డీఎల్‌పీవో సంధ్యారాణి

నిధుల దుర్వినియోగంపై విచారణ, రికార్డులు సీజ్

పరిగి, డిసెంబర్ 2 : పరిగి మండలం నస్కల్ గ్రామపంచాయతీ కార్యదర్శి ఫరూఖ్ హుస్సేన్ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం డివిజనల్ పంచాయతీ అధికారి సంధ్యారాణి విచారణ జరపడంతోపాటు గ్రామపంచాయతీ రికార్డులు సీజ్ చేసి తీసుకువెళ్లారు. పరిగి మండలం నస్కల్ గ్రామపంచాయతీకి 2024 ఫిబ్రవరి నుంచి సెప్టెంబర్ వరకు ఎన్ని నిధులు వచ్చాయి, ఎంత ఖర్చు చేశారని సమాచార హక్కు చట్టం కింద గ్రామస్తుడు ప్రేమ్‌కుమార్ దరఖాస్తు చేసుకోగా రూ.12లక్షలు వచ్చాయని, రూ.9.50లక్షలు ఖర్చయినట్లు పేర్కొనగా.. మిగతా రూ.2.50 లక్షలకు లెక్క లేదనే ఆరోపణలున్నాయి. గ్రామపంచాయతీ సిబ్బందికి నెలకు రూ.49వేల చొప్పున 8 నెలలకు రూ.3,92,000 వేతనాలు ఇవ్వగా వేతనాలకు రూ.5.20లక్షలు ఖర్చు చేసినట్లు చూపించారన్నారు. నిధుల దుర్వినియోగంపై వెంటనే విచారణ జరపాల్సిందిగా గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డివిజనల్ పంచాయతీ అధికారి సంధ్యారాణి సోమవారం నస్కల్ గ్రామపంచాయతీని సందర్శించి విచారణ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందికి ఇచ్చినట్లుగా చెబుతున్న వేతనాల డబ్బుల్లో వ్యత్యాసం ఉందని, రూ.2.50లక్షలకు లెక్క లేదని ఫిర్యాదుదారులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కొత్తగా లే అవుట్ చేస్తున్న భూమి వ్యవసాయేతర భూమిగా మార్పు చేయకముందే ఇంటి నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి ఎలా అనుమతి ఇస్తారని వారు ప్రశ్నించారు. దీని వెనకాల అవినీతి జరిగిందని వారు ఆరోపించారు. వెంటనే పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. దీంతో విచారణ చేపట్టిన డీఎల్‌పీవో సంధ్యారాణి గ్రామపంచాయతీ రికార్డులను సీజ్ చేసి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనపురం శిశుపాల్

బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గురుకులాల బాట

నవాబుపేట, డిసెంబర్ 2 : గురుకుల పాఠశాలల సమస్యలపై ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును నిరసిస్తూ గురుకుల పాఠశాలలను సందర్శించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నవాబుపేటకు చెందిన మహాత్మా జ్యోతిబాపూలే బాయ్స్ స్కూల్, పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనపురం శిశుపాల్ మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో విద్యార్థులకు ఫుడ్‌లో నాణ్యత లేక అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన భోజనాన్ని అందించి మంచి విద్యను అందించాల్సిన ప్రభుత్వం విద్యార్థుల సమస్యలపై చిన్నచూపు చూడటం మానుకోవాలన్నారు. మెనూ ప్రకారం ఆహారం అందించి తల్లిదండ్రులు వారిపై పెట్టుకున్న ఆశయాలకనుగుణంగా సర్కారు నడుచుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటికీ యూనిఫామ్‌లను అందించలేకపోవడం సిగ్గుచేటని ఆవేదన వ్యక్తంజేశారు. పక్కా భవనం లేక విద్యార్థులకు అనేక అవస్థలను ఎదుర్కొంటున్నారని, సొంత భవనాలను నిర్మించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి ఉన్న సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషిచేస్తామని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. ఈ సమస్యలన్నిటినీ మా రాష్ట్ర కమిటీకి నివేదిక సమర్పించి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ద్వారా అసెంబ్లీలో గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎండగడతామని శిశుపాల్ తెలిపారు.

జీఎం విత్తనాలు ప్రవేశపెట్టకుండా

పార్లమెంట్‌లో తీర్మానం చేయాలి

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడిగే గజేందర్‌గౌడ్

షాబాద్, డిసెంబర్ 2 : జీఎం విత్తనాలను భారతదేశంలో ప్రవేశపెట్టకుండా పార్లమెంట్‌లో తీర్మానం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడిగే గజేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం షాబాద్‌లోని రైతు వేదికలో భారతీయ కిసాన్ సంఘ్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాల జెనెటికల్ మోడిఫికేషన్ వల్ల అనేక దుష్పరిణామాలు వస్తున్నట్లు ప్రజల్లో ఆందోళన ఉందని తెలిపారు. దేశంలో బీటీ వన్, టు, త్రీ, ఫోర్, ఫైవ్ పత్తి విత్తనాల వల్ల అనారోగ్యానికి పాల్పడ్డ సంఘటనలు ఉన్నాయన్నారు. బీటీ పత్తి విత్తనాల సాగులో గ్లైపోసెట్ కలుపు మందు వాడుతున్నారని.. గ్లైపోసెట్ మందు క్యాన్సర్‌కు దారితీస్తున్నట్లు అనేక పరిశోధనలు వెల్లడించినట్లు చెప్పారు. వంకాయ, ఆవాలు లాంటి విత్తనాల్లో జీఎం ప్రవేశపెట్టి అధిక దిగుబడిని సాధించవచ్చని విదేశీ కంపెనీలు నమ్మబలుకుతున్నాయన్నారు. జెనెటికల్ మార్ఫింగ్ జరిగిన విత్తనాలతో పండిన పంటలు మాంసాహారమా, శాఖాహారమా ఇప్పటికీ తేల్చలేదన్నారు. విత్తనాల ప్రవేశాన్ని ఆపేందుకు ఇప్పటికే అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల పార్లమెంట్ సభ్యులకు వినతిపత్రాలు అందించడం జరిగిందని ఆయన తెలిపారు. సమావేశంలో భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు యాదవరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మండల సహాయ కార్యదర్శి చంద్రయ్య గౌడ్, కార్యవర్గ సభ్యులు, రైతులున్నారు.

పర్సాపూర్‌లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి

- సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్
- పర్సాపూర్, పెద్దనందిగామ గ్రామాల్లో వరిధాన్యం కేంద్రాల పరిశీలన

కొడంగల్, డిసెంబర్ 2 : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ ఆదేశించారు. సోమవారం మండలంలోని పర్సాపూర్, పెద్దనందిగామ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో నేరుగా మాట్లాడి కేంద్రంలోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టడంతోపాటు మట్టి పెడ్డలు వంటి వాటిని శుభ్రంచేసి తీసుకొని రావడం వల్ల త్వరితగతిన కొనుగోళ్లు చేపట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత మంది రైతుల నుంచి ఎంత ధాన్యాన్ని కొనుగోలు చేశారు, ఎంతవరకు ధాన్యాన్ని తరలించారనే అంశాలను కేంద్రం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న బొలేరో

ఇద్దరు మృతి

అదుపుతప్పి బోల్తాపడ్డ బొలేరో వాహనం

వికారాబాద్, డిసెంబర్ 2 : బైక్‌పై వెళ్తున్న వాహనదారులను బొలేరో వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందిన సంఘటన వికారాబాద్‌లో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్‌లోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన రవీందర్(45) వికారాబాద్ ప్రభుత్వ దవాఖాన నిర్మాణంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే పనిచేస్తున్న మరో వ్యక్తి హేమంత్(25)తో రాజీవ్‌నగర్ కాలనీ నుంచి వికారాబాద్‌కు బైక్‌పై వస్తున్నారు. బొలేరో వాహనం మద్యం బాటిళ్లతో హైదరాబాద్ నుంచి కోట్‌పల్లికి వెళ్తున్నది. మార్గమధ్యంలో ఎస్ఏపీ కళాశాల సమీపంలోని పీజీ కాలేజ్ నుంచి కారు రావడంతో బొలేరో వాహనం ఢీకొట్టింది. అదే సమయంలో బైక్‌పై వెళ్తున్నవారిపై అదుపు తప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని చికిత్స నిమిత్తం 108లో వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారన్నారు. ప్రమాద స్థలాన్ని వికారాబాద్ పోలీసులు పరిశీలించారు. రోడ్డు ప్రమాదం జరగడంతో భారీగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో జేసీబీ సహాయంతో రోడ్డుపై పడ్డ వాహనాన్ని తొలగించారు.

బొలేరో వాహనం ఢీకొనడంతో ధ్వంసమైన కారు

పూజకు వెళ్లొస్తుండగా..

అక్కా తమ్ముడు దుర్మరణం

- లారీని వెనుక నుంచి ఢీకొన్న కారు
- కొహెడ వద్ద ఓఆర్ఆర్‌పై దుర్ఘటన

ఓఆర్ఆర్‌పై లారీని ఢీకొన్న కారు

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 2 : అమ్మగారింట్లో పూజకు వెళ్లొస్తూ అక్క.. అక్కను ఇంటి దగ్గర దించి వద్దామనుకున్న తమ్ముడు.. సరదా మాటలు సాగుతుండగానే జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఇద్దరిని బలిగొన్నది. అక్కా తమ్ముడు ఒకేచోట విగతజీవులుగా పడిపోయిన దుర్ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయిపల్లికి చెందిన ఎరగాడిండ్ల ఆంజనేయులు ఇంట్లో ఇంటి దేవత పండుగ చేశాడు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరు రాఘవేంద్రకాలనీ–2లో ఉంటున్న కుమార్తె చల్ల పద్మ(31)ను పండుగకు పిలిచాడు. ఆమె తన భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి కానాయిపల్లికి వెళ్లింది. పండుగ అనంతరం, అక్క పద్మతోపాటు బావ, వారి ఇద్దరు పిల్లలను కుంట్లూరులో వదిలేందుకు ఆంజనేయులు కొడుకు మనోజ్ (25) ఉదయమే కారులో బయలుదేరాడు. కొహెడ గ్రామ రెవెన్యూ పరిధిలో ఓఆర్ఆర్‌పై ఎగ్జిట్ నంబర్ 12 దాటగానే ముందువెళ్తున్న లారీ ఎలాంటి సిగ్నళ్లు వేయకుండా ఒక్కసారిగా నెమ్మది అయింది. ఆ వెనుకే వేగంగా వచ్చిన కారు.. ముందువెళ్తున్న లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో అక్కాతమ్ముడు పద్మ, మనోజ్ మృత్యువాతపడ్డారు. పద్మ భర్త వెంకటేశ్‌తోపాటు ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి. ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ కేసులు బనాయించడం సిగ్గుచేటు

బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 2 : గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అక్రమ కేసులు పెట్టడం కాంగ్రెస్‌కు తగదని బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని పలు గురుకుల పాఠశాలలను సందర్శించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బృందంపై గురుకులాల అధ్యాపకులతో కేసులు పెట్టించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలను ఎప్పటికప్పుడు ఎండగడతామని ఆయన తెలిపారు.

అక్రమ కేసులు పెట్టడం పద్ధతికాదు

గురుకులాల్లో ఉన్న విద్యార్థుల సమస్యలపై అధ్యయనంచేసి రిపోర్ట్ చేస్తున్న నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం సిగ్గుచేటని బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్ అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ బీసీ సభ్యులు ఆంజనేయులుగౌడ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తోపాటు ఇతర నాయకులపై పెట్టిన కేసులు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 7 నుంచి రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గురుకులాల బాట కార్యక్రమం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్ల విద్యార్థుల సమస్యలను గుర్తించి, బీఆర్ఎస్వీ సిద్ధంచేసిన నివేదికను అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ లేవనెత్తనున్నదని వారు తెలిపారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మున్సిపల్ అధ్యక్షుడు శివసాయి, మంచాల మండల అధ్యక్షుడు ప్రవీణ్‌నాయక్, బీఆర్ఎస్వీ నాయకులు కరుణాకర్, మహేశ్, కిరణ్, నితిన్, వెంకటేశ్, అశోక్, రంజిత్, రవి, భాను, ధర్మానాయక్, అరుణ్, మణికంఠ పాల్గొన్నారు.